క్లుప్తంగా

నోటీసులు జారీ

సాక్షి ఎఫెక్ట్..

మహాముత్తారం: హరిత హారంలో భాగంగా మండలంలోని నర్సింగాపూర్ నుంచి నల్లగుంటమీనాజీపేట వెళ్లే ప్రధాన రహదారిలో నాటిన మొక్కలను కొంతమంది పొలం పక్కకు ఉన్నాయనే నేపంతో నరికివేశారు. దీంతో 'సాక్షి'లో 'హరితహారంపై గొడ్డలివేటు' శీర్షికను ఈనెల 4న ప్రచురించింది. దీంతో అధికారులు స్పందిచారు. నర్సింగాపూర్ గ్రామానికి చెందిన గంట దేవేందర్‌రెడ్డి అనే రైతుకు చెట్లకు గాటు పెట్టి ఎండిపోయే విధంగా నష్టపరిచినందుకు పంచాయతీ కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని లేనిచో తదుపరి చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొన్నారు.

నియామకం


పోచయ్య

కాటారం: ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జిల్లా కోఆర్డినేటర్‌గా మండల కేంద్రానికి చెందిన పొట్ట పోచయ్య నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపన్న, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు శనివారం పోచయ్యకు నియామక పత్రం అందజేశారు. సంఘం బలోపేతం చేయడంలో భాగంగా జిల్లా కమిటీ, మండల, గ్రామ కమిటీలను ఏర్పాటు చేయడం కోసం జిల్లా కోఆర్డినేటర్‌ను నియమించినట్లు తెలిపారు. తన నియామకానికి సహకరించిన సంఘం జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులకు పోచయ్య కృతజ్ఞతలు తెలిపారు.

కమిటీ ఎన్నిక



మల్హర్: మండలంలోని అన్సాన్‌పల్లి గ్రామంలో అఖిల భారత యాదవ సంఘం మాహాసభ గ్రామ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నానువాలా కుమార్ యాదవ్, ఉపాధ్యక్షుడిగా ముత్యాల రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా జంగా రవితేజ, కార్యదర్శిగా కొమరయ్య, కోశాధికారిగా రాముబాబులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం డివిజన్ అధ్యక్షుడు స్వామి యాదవ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి రామన్న, చిన్న మల్లయ్య, భూమేష్, మొగిలి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పురుగులమందు తాగి వివాహిత ఆత్మహత్య

కాటారం: భర్త మద్యం సేవించి తరుచు గొడవ పడుతున్నాడని మనస్థాపంతో వివాహిత పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందిన సంఘటన మండలంలోని రేగులగూడెంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెర్క లావణ్య(35), పెర్క రవికి కొన్నేళ్ల క్రితం వివాహం జరగగా కుమారుడు, కూతురు ఉన్నారు. రవి ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ మద్యం సేవించినప్పుడల్లా భార్యతో గొడవపడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో ఈ నెల 4న రాత్రి ఇంట్లో దేవుడికి చేద్దామని రవి లావణ్యకు చెప్పగా రాత్రి వద్దు ఉదయం చేసుకుందామని ఆమె భర్తకు నచ్చజెప్పడానికి ప్రయత్నించింది. కానీ రవి వినకపోవడంతో భార్య, భర్తల మధ్య గొడవ జరిగింది. భర్త తన మాట వినడం లేదని, తరుచూ గొడవపడుతున్నాడని తీవ్ర మనస్థాపానికి గురైన లావణ్య శుక్రవారం ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు కాటారంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. లావణ్య పరిస్థితి విషమయంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి అత్త రాజమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మ్యాక అభినవ్ తెలిపారు.

ఏజెన్సీ ప్రాంతాలపై నిఘా



ఏటూరునాగారం: మారుమూల ఏజెన్సీ గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట ప్రధాన కూడలి వద్ద శనివారం ఎస్సై తాజొద్దీన్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసుల ప్రత్యేక నిఘాతో చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తూ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనాల సరైన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్, సిఆర్పిఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

శ్యామప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి


భూపాలపల్లి రూరల్: శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం పార్టీ భూపాలపల్లి అర్బన్ అధ్యక్షుడు సామల మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశిధర్ రెడ్డి హాజరై శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భారతీయ జనతా పార్టీ కార్యాలయం ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నిశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. శ్యామ ప్రసాద్ ముఖర్జీ ప్రముఖ జాతీయ వాద నేతలలో ముఖ్యుడని భారతీయ జనస్థానం స్థాపించి ఆధునిక హిందుత్వం హిందూ జాతీయ వాదాన్ని ప్రగాఢంగా విశ్వసించాడన్నారు. పార్లమెంట్ కో కన్వీనర్ లింగంపల్లి ప్రసాద్ రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు బట్టు రవి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు పోలసాని తిరుపతిరావు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సత్యవతి, అర్బన్ ప్రధాన కార్యదర్శి తుమ్మేటి రాంరెడ్డి, అర్బన్ ఉపాధ్యక్షుడు కోరే సుధాకర్, నాయకులు ఊరేటి మునీందర్ కొమురయ్య, వేణు రావు పాల్గొన్నారు.

చిట్యాల: మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖర్జీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గుండ సురేష్, గజనాల రవీందర్, అశోక్ చారి, మొగిలి, సదానందం, శ్రీనివాస్‌రెడ్డి, మైదం శ్రీకాంత్, మహేష్, ప్రభాకర్, రాజేందర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మల్హర్: హిందు జాతీయ వాద నాయకుడు, ఉద్యమ నేత భారతీయ జన సంఘం వ్యవస్థపకుడు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను మండల కేంద్రం తాడిచర్లలో బీజేపీ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారతీయ జన సంఘను స్థాపించి హైందవ ఏకీకరణకు తోడ్పడిన మహనీయుడు శ్యామ్ ప్రసాద్‌ముఖర్జీ అని కొనియాడారు. అనంతరం ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు అమ్మ పేరుతో ఎస్టీ హాస్టల్ ఆవరణలో మొక్కలు నాటారు. బీజేపీ మంథని అసెంబ్లీ కన్వీనర్ మల్క మోహన్‌రావు, మండల అధ్యక్షుడు ముడుతనపల్లి ప్రభాకర్, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ రమేష్, బూత్ అధ్యక్షుడు గట్టయ్య, సంజీవ్, నవీన్, మహేష్, నిషాన్, సంజీవ్, సుమన్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన నాయకులు

రేగొండ: మండలంలోని రూపిరెడ్డిపల్లి గ్రామంలోని రామాలయంలో శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా అమ్మ కోసం ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాపయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్‌రావు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు పొలుసాని తిరుపతి రావు, బీజేవైఎమ్ రాష్ట్ర నాయకులు సయ్యద్ గాలిఫ్, కుమారస్వామి, శంకర్, విజేందర్, రఘుపతి, కుమార్ పాల్గొన్నారు.


చిట్యాల: శ్యామప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న వెంకటేష్ గౌడ్


మల్హర్: ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

రైతులు పండ్ల మొక్కలు నాటుకోవాలి


మొక్క నాటుతున్న ఎంపీడీఓ జయశ్రీ

చిట్యాల: రైతులు పొలం గట్ల వెంబడి పండ్ల మొక్కలను నాటుకోవాలని ఎంపీడీఓ జయశ్రీ అన్నారు. శనివారం మండలంలోని జూకల్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్, ప్రజ్వల్ ఫార్మర్ సంస్థ ఆధ్వర్యంలో పండ్ల మొక్కలు, కొబ్బరి మొక్కలను గట్టు వెంబడి నాటే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రైతు సత్యం వ్యవసాయ భూమిలో 60 మొక్కలను నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సన్న, చిన్న కారు రైతులు తమ భూమి గట్టు పైన మొక్కలను నాటుకుంటే భూమి వరదలకు కొట్టుకుపోకుండా ఉంటుందని దీంతో భూసారాన్ని కాపాడుకోవచ్చాని తెలిపారు. మొక్కలను నాటుకున్న రైతులకు ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా నెల నెల మెయింటెనెన్స్ ఖర్చులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు ఫీల్డ్ అసిస్టెంట్లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజ్వల్ సంస్థ దేవులపల్లి శ్రీహరి, మాజీ సర్పంచ్ పుట్టపాక మహేందర్, నవచైతన్య సొసైటీ డైరెక్టర్ దొంతి రాంరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ చిరంజీవి, రైతులు పాల్గొన్నారు.

'మంథని ప్రజలకు శ్రీపాదరావు మహనీయుడే'


మాట్లాడుతున్న మహిళ నాయకులు

కాళేశ్వరం: మంథని ప్రజలకు మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు మహనీయుడే అని నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ మహిళ నాయకురాళ్లు బండెల సత్తమ్మ, అంగోతు సుగుణ, జాడీ మహేశ్వరీ అన్నారు. శనివారం మహదేవపూర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. శ్రీపాదరావు స్మారక విగ్రహం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేస్తే బీఆర్ఎస్ పార్టీ మహిళ నాయకులు కేదారి గీత మతిభ్రమించి రాద్ధాంతం చేస్తున్నారని అన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు తండ్రి శ్రీపాదరావు మంథని ప్రజల కోసం అన్నారం అడవుల్లో ప్రాణాలు త్యాగం చేశారని గుర్తు చేశారు. మరోసారి వారి కుటుంబం జోలికి వస్తే, అర్థరహితమైన వ్యాఖ్యలు చేసిన ఊపేక్షించమని హెచ్చరించారు. పుట్ట మధు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆయన తల్లి పుట్ట లింగమ్మ ట్రస్టు పేరుతో మహదేపూర్ ఆస్పత్రికి బోర్డుపెట్టిన ఘనత మీదని ఆరోపించారు. వారి వెంట మాజీ ఎంపీపీ రాణిబాయి, మాజీ జెడ్పీటీసీ అరుణ, మాజీ డైరెక్టర్ కుంభం పద్మ ఉన్నారు.

చికెన్ సెంటర్లను తొలగించాలి


నోటీసులు అందజేస్తున్న తహసీల్దార్ సృజన్ కుమార్

గోవిందరావుపేట: మండల పరిధిలోని పస్రా గ్రామంలోని రామాలయం గుడి పక్కన ఉన్న చికెన్ సెంటర్లని తొలగించాలని శనివారం అధికారులు నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. గ్రామంలోని రామాలయం సమీపంలో చికెన్ సెంటర్లు పుట్టగొడుగుల పుట్టుకుస్తున్న క్రమంలో దుర్వాసన రావడంతో పాటు, దోమలు పెరిగి అనారోగ్యాల బారిన పడుతున్నామని స్థానికులు గతంలో అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నారు. అలాగే రామాలయం గుడి పక్కనే ఉండడంతో పలువురు అభ్యంతరం చెప్పుతూ.. కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ దివాకర వెంటనే స్పందించి రామాలయం గుడి సమీపంలో ఉన్న చికెన్ షాపులు ఖాళీ చేసేలా మండల అధికారులకు ఆదేశాలు ఇచ్చాడు. ఈ మేరకు చికెన్ సెంటర్ యజమానులకు మూడు రోజుల్లో ఖాళీ చేయమని తహసీల్దార్ సృజన్ కుమార్, ఎంపీఓ సాజిదా బేగం, గ్రామ కార్యదర్శి శరత్ కుమార్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు.

కిరాణా షాపుల్లో పోలీసుల తనిఖీ


కిరాణా దుకాణాల్లో తనిఖీ చేస్తున్న పోలీసులు

వాజేడు: మండల పరిధిలోని పలు కిరాణా షాపుల్లో వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి తనిఖీలను నిర్వహించారు. ప్రభుత్వ నిషేధిత గుట్కాల విక్రయాలు జరుగుతున్నాయనే సమాచారంతో షాపుల్లో సోదాలు చేశారు. ఈ తనిఖీల్లో దుకాణాల్లో ఎలాంటి గుట్కాలు లభించలేదు. వాహనాలను సైతం తనిఖీలు చేశారు. గుట్కాలను విక్రయించినా సరఫరా చేసినా చట్టపరంగా చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు.

ఆర్డర్ కాపీ అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్

భూపాలపల్లి రూరల్: 61 సంవత్సరాలు నిండిన గ్రామ వీఆర్ఏల వారసులను వీఆర్ఏలుగా గుర్తించి ఆర్డర్‌కాపీలు అందించాలని రాష్ట్ర గ్రామ వీఆర్ఏల వారసుల కమిటీ జిల్లా అధ్యక్షుడు చెన్నపురి హరీశ్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో వీఆర్ఏల వారసుల జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ జిల్లా అధ్యక్షుడు చెన్నపూరి హరీశ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో మొత్తం వీఆర్ఏలు 20555 మంది ఉన్నారని. అందులో 16758 మందికి గత ప్రభుత్వం రెగ్యులర్ చేసి ఉద్యోగాలిచ్చారన్నారు. మిగిలిన 61 సంవత్సరాలు దాటినా 3797 మంది వీఆర్ఏల వారసులకు కూడా ఉద్యోగాలు ఇవ్వాలని గత ప్రభుత్వం జీఓ జారీ చేయగా ఎన్నికల కోడ్ వచ్చిందన్నారు. దీంతో అప్పటి ప్రభుత్వం ఆర్డర్ కాపి ఇవ్వలేదన్నారు. జీఓ జారీ అయి సంవత్సర కాలం పూర్తయిందన్నారు. ఎన్నికల కోడ్ పూర్తి అయినందున కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి వీఆర్ఎల వారసులకు ఆర్డర్‌కాపీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కాగా కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడిగా గడ్డం రమేశ్, ప్రధాన కార్యదర్శిగా భూతం రాజు, కోశాధికారిగా చెన్నూరి కర్ణాకర్, జిల్లా కో కన్వీనర్‌గా గంధం సురేష్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మేదరి సతీష్, కుమార్, సాయి, భద్రయ్య, రాజబాపు, మేనక, తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సర్టిఫికెట్ల అందజేత


సర్టిఫికెట్లను బాధితుడి తండ్రికి అందజేస్తున్న రామకృష్ణ

గోవిందరావుపేట: మండల పరిధిలోని పస్రా హైస్కూల్‌లో 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థి సల్లూరి దిలీప్ సర్టిఫికెట్లను గోవిందరావుపేట బస్టాండ్ సమీపంలో గురువారం పోగొట్టుకున్నాడు. మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త తుమ్మల రామకృష్ణ బస్టాండ్‌లోకి వచ్చిన సమయంలో సర్టిఫికెట్ల కవర్ దొరకింది. దీంతో ఆధారాలను బట్టి సల్లూరి దిలీప్‌విగా గుర్తించి చరావాణిలో పలు వాట్సప్ గ్రూప్‌ల్లో పంపాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న విద్యార్థి తండ్రి సల్లూరి రమేష్ శనివారం రామకృష్ణ వద్దకు వచ్చి సర్టిఫికెట్లను తీసుకున్నాడు. దీంతో తుమ్మల రామకృష్ణను గ్రామస్తులు అభినందించారు.

సమయపాలన పాటించని ఉపాధ్యాయులు


ఉపాధ్యాయులు రాక బయట ఉన్న విద్యార్థులు

చిట్యాల: మండలంలోని నవాబుపేట ఎస్సీకాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలలోని ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని శనివారం గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పాఠశాలలో 20 విద్యార్థులు ఉండగా ఇద్దరు టీచర్లు పని చేస్తున్నారు. కానీ పాఠశాలకు ఉదయం 9 గంటలకు రావాల్సిన ఉపాధ్యాయులు 9.25 నిమిషాలకు కూడా రాలేదు. విద్యార్థులే తరగతి గదుల తాళాలను తీసుకుని బయట ఆడుకుంటున్నారు. సమయం అవుతున్న విద్యార్థులు ఎందుకు ఆడుకుంటున్నారని పాఠశాలకు వెళ్లగా 9.25 నిమిషాల వరకు కూడా ఏ ఉపాధ్యాయుడు రాలేదని గ్రామస్తులు తెలిపారు. మండల అధికారులు స్పందించి సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్య తీసుకోవాలని వారు కోరుతున్నారు.

వేతనాలు ఇప్పించాలని వినతి


బిల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిబ్బంది

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ సఫాయి సిబ్బంది తమకు వేతనాలు ఇప్పించాలని కోరుతూ బిల్ కలెక్టర్ రవీందర్‌కు శనివారం వినతి పత్రాన్ని అందజేశారు. వేతనాలు అందక కుటుంబాలు గడవడం లేదన్నారు. వెంటనే వేతనాలు అందజేసి తమను ఆదుకోవాలని కోరారు.

వేతనాలు లేక ఇబ్బందులు

మేజర్ గ్రామ పంచాయతీలో 16 వార్డుల్లో పనిచేస్తున్న గ్రామ పంచాయతీ సఫాయి కార్మికులు వేతనాలు ఇబ్బందులు పడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇటీవల ఇసుక క్వారీ వద్ద లారీకి రూ.100ల చొప్పున వసూలు చేసిన నగదు నిల్వ గ్రామ పంచాయతీలో రూ.5లక్షల వరకు ఉంది. అలాగే ఐటీడీఏ నుంచి స్పెషల్ ఫండ్ కింద రూ.7లక్షల వరకు నిధులు వచ్చాయి. వీటి నుంచి అయినా కూడా వేతనాలు ఇవ్వవచ్చు కానీ పంచాయతీ అధికారులు ఇవ్వటం లేదని ప్రజలు వాపోతున్నారు. అంతేకాకుండా కొత్త భవనాల నుంచి వచ్చే ఇంటిమార్పిడి నిధులు సైతం గ్రామ పంచాయతీలో ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సఫాయి కార్మికుల వేతనలు వెంటనే ఇవ్వాలని కోరుతున్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత


పట్టుకున్న పశువులు

ఏటూరునాగారం: ఇతర నగరాలకు అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టుకున్నట్లు ఎస్సై తాజొద్దీన్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం నుంచి హైదరాబాద్‌కు పశువులను నిత్యం తరలిపోతున్నాయనే సమాచారం మేరకు ఏటూరునాగారం చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ఈ క్రమంలో డీసీఎం వాహనంలో 23 పశువులను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి డీసీఎం వాహనంతో పాటు డ్రైవర్, క్లీనర్‌లను అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. డీసీఎం డ్రైవర్ వెంకటాపురం మండలం లింగాపురం గ్రామానికి చెందిన సయ్యద్ ఇర్ఫాన్‌తో పాటు క్లీనర్‌గా పనిచేస్తున్న జంగాలపల్లి గ్రామానికి చెందిన మారపాక రాజులపై కేసులు నమోదు చేశామన్నారు. పశువులను అక్రమంగా గోవదకు తరలించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సివిల్స్ సీఆర్పీఎస్ పోలీసులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు సహకరించాలి

ఎస్ఎస్‌తాడ్వాయి: శాంతి భద్రత పరిరక్షణకు పార్టీలకు అతీతంగా సహకరించాలని పస్రా సీఐ రవీందర్ అన్నారు. పస్రా సీఐగా బాధ్యతలు స్వీకరించిన రవీందర్ మండలంలోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు శనివారం మార్యదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐ రవీందర్‌ను శాలువాలతో సన్మానించారు. మండల అధ్యక్షుడు దండుగుల మల్లయ్య, చంద్రం, అరుణ ఉన్నారు.

అంతిమ యాత్రలో అరిగోస

- వాగు దాటుతూ మోయాల్సిన దుస్థితి
- వైకుంఠధామం నిర్మించినా నిరుపయోగం


జంపన్నవాగులో భుజాలపై మోసుకుంటూ అంతిమయాత్ర చేస్తున్న బంధువులు(ఫైల్)

ఏటూరునాగారం: మేజర్ గ్రామ పంచాయతీ అయినా ఏటూరునాగారంలో 14 వేల మంది జనాభా ఉన్నారు. ఎవరైనా మృతి చెందితే వారికి దహన సంస్కారాలు చేసే వైకుంఠధామానికి సరైన రోడ్డు మార్గం లేక కష్టాలు పడాల్సిన దుస్థితి నెలకొంది. జంపన్నవాగు ఉండడంతో అంతిమయాత్రను వాగుదాటుకుంటూ భుజాలపై మోసుకుంటూ శ్మశాన వాటికకు తరలించాల్సి వస్తోంది. ఒక వేళ వాగు ఉధృతి పెరిగితే ఒడ్డుకు, లేదా కరకట్ట పక్కనే ఖననం చేయాల్సిన దుస్థితి నెలకొంది. అయితే రెండేళ్ల క్రితం జంపన్నవాగు వద్ద వైకుంఠధామాన్ని ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ.22 లక్షలతో నిర్మించారు. కానీ దానిలో ఎలాంటి దహన సంస్కారాలు జరగడం లేదు. జాతీయ రహదారి నుంచి వైకుంఠ దామం వరకు ఉన్న రోడ్డు గోతుల మయంగా మారడంతో ఏ వాహనం వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో దూరభారం వల్ల దహనం చేసేందుకు అటువైపు మొగ్గుచూపడం లేదు. ప్రజల కష్టాలను తీర్చాల్సిన అధికారులు మిన్నకుండిపోతున్నారు. స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు సైతం ఈ విషయంపై పెద్దగా దృష్టి సారించడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. జాతీయ రహదారి నుంచి వైకుంఠ దామం వరకు శాశ్వత రోడ్డుమార్గం ఏర్పాటు చేయకపోవడం వల్ల ఎవరూ మృతి చెందిన ఇబ్బందులు పడుతూ అంతిమయాత్రలను చేయాల్సి వస్తోందని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్లతో అవస్థలు

గ్రామంలోని జంపన్నవాగు నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను గ్రామానికి తరలిస్తుంటారు. అయితే వైకుంఠదామానికి నిర్మించిన రోడ్డుపై నుంచి ఇసుక ట్రాక్టర్లు రవాణా జరుగుతుండడంతో రోడ్డు గోతులమయంగా మారింది. ఇసుక ట్రాక్టర్ల యజమానులు ఇసుక తరలింపు కోసం ప్రత్యేక రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

శాశ్వత మార్గం కల్పించాలి



వైకుంఠధామానికి శాశ్వత రోడ్డు మార్గం ఏర్పాటు చేయాలి. అంతిమ యాత్ర సాగేందుకు వాగులు దాటాల్సి వస్తోంది. వాగు వరద ఎక్కువైతే మా బాధలు చెప్పలేనివి. వాగు దాటకుండా జాతీయ రహదారి నుంచి వైకుంఠ ధామం వరకు రోడ్డు మార్గం వేసి అన్ని సౌకర్యాలను కల్పించాలి.

- గండెపల్లి నర్సయ్య, ఏటూరునాగారం


గుంతలమయంగా ఉన్న వైకుంఠధామానికి వెళ్లే రోడ్డు

చర్య తీసుకోవాలి


మాట్లాడుతున్న మల్లేశ్

టేకుమట్ల: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తూ, విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై చర్య తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారెపెల్లి మల్లేశ్ అన్నారు. శనివారం మండలంలోని అంకుషాపూర్ ప్రాథమిక పాఠశాల ఆయన సందర్శించి మాట్లాడారు. గత విద్యాసంవత్సరంలో పాఠశాలలో 61 మంది విద్యార్థులు ఉండేవారని, ఉపాధ్యాయుల నిర్లక్ష్యం మూలంగా ప్రస్తుతం 41 మంది మాత్రమే ఉన్నారన్నారు. పాఠశాలలను నిరంతరం పర్యవేక్షించాల్సిన జిల్లా విద్యాధికారి, మండల విద్యాధికారి ఏ ఒక్క రోజు తనిఖీ చేపట్టిన పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.